# మారిన స్నేహం ★

రచన :
పోతుకూచి సాంబశివరావు



రామారావు, రంగారావు ఒక యింటి ప్రక్కనే చాలాకాలంనుంచి ఉంటూ, ఒకే కాలేజీలో చదువుకుంటూండడంవల్ల చాలా దగ్గరిస్నేహితులయ్యారు. ఇద్దరి మనస్తత్వాలు అన్నివిధాల ఏకీభవించాయి.

"మన యింట్లో అద్దెకు ఎవరో కొత్త విగ్రహం వచ్చిందోయి" అన్నాడు రామారావు.

"ఐతే మనకేమైనా ఉపయోగిస్తాడా" అన్నాడు రంగారావు ఏదో అంతరార్థంతో.

"మరి నేను నీతో చెబుతున్నదెందుకు. ఉపయోగిస్తాడనేగా. మనిషి చాలా నెమ్మదిగా మర్యాదగా మాట్లాడుతాడు. ఇన్‌కం టాక్సు డిపార్టుమెంటులో పనిట. నూట అరవయి రూపాయి లిస్తారుట. స్నేహంచేస్తే ఊరికే పోదు" అన్నాడు రామారావు.

"పద యింక ఆలస్యమెందుకు పలకరిద్దాము" అన్నాడు రంగారావు. ఇద్దరూ కలిసి వాళ్ళయింటికి వెళ్ళారు.

"నమస్కారం వెంకటశాస్త్రిగారూ" అని రామారావు యింట్లో అడుగుపెట్టాడు. రంగారావు అతన్ని అనుసరించాడు.

"ఇతను నా స్నేహితుడు రంగారావు. ఈప్రక్కనే ఉంటున్నాడు అని రామారావు రంగారావును పరిచయం చేశాడు శాస్త్రికి. "నమస్కారమండీ" అని వెంకటశాస్త్రి వినయంతో స్వాగతమిచ్చి కూర్చొమన్నాడు. ప్రక్కనున్న సిగరెట్టుపెట్టె తీసి యిద్దరికీ చెరొక సిగరెట్టు యిచ్చాడు ప్రసంగం కదిలింది. ఇన్‌కంటాక్సు డిపార్టుమెంటువిషయాలు, కాలేజీ వ్యవహారాలు, అందులో చదివే ఆడపిలల సంగతులు, యింటిప్రక్క ఉంటున్న వాళ్ళ భోగట్టాలు, రైలువేగంలో దొర్లిపోయాయి.

"సాయంత్రమయింది కాస్త అలా షికారు పోదాం లెండి" అన్నాడు రంగారావు వెంకటశాస్త్రివైపు తిరిగి.

సరే అని వెంకటశాస్త్రి యింట్లోకి వెళ్ళాడు ముఖం కడుగుకుని దుస్తులు మార్చుకుందామని.

"ఏరా! యీయన భార్యాసమేతంగా ఉంటున్నాడా ఏమిటి?" అన్నాడు రంగారావు ఏదో ఆలోచిస్తూ.

"అవుననుకో ఆ విషయం మనకి అడ్డురాదు. ఒకసారి మన పద్ధతులు నేర్పితే సరి. యింక మనవెంటే తిరుగుతాడు" అన్నాడు రామారావు కీవిగా.

వెంకటశాస్త్రి బట్టలు మార్చుకుని బయటకు రాగానే షికారుకు బయలుదేరారు ముగ్గురు. సగం దారిలోకి వెళ్ళాక రంగారావు అన్నాడు "కాస్త కాఫీ పుచ్చుకు పోదాం" అని. హోటల్లోజేరి ముగ్గురూ సుష్టుగా తిన్నారు. సెర్వరు బిల్లు తెచ్చి యిచ్చాడు అయిదు రూపాయిలయింది.

రంగారావు బిల్లుతీసుకుని, జేబులు తడిమి తెల్లముఖంవేశాడు. అరరే పర్సు మర్చి

పోయూనే అన్నాడు. రామారావు జేబులు తడిమి వాడగ్గర ఒక్క రూపాయిమాత్రమే వుంది అన్నాడు. ఆ పరిస్థితుల్లో యింక ఊరుకుంటే స్నేహమర్యాదలకు లోపమని జేబులోవున్న అయిదు రూపాయిలు తీసి బిల్లు చెల్లించాడు వెంకటశాస్త్రి.

"పొరపాటయింది శాస్త్రిగారు ఏమీ అనుకోరనుకుంటా" అన్నాడు రంగారావు.

"నేను యింటికి వెళ్ళాక డబ్బు మీకు యిచ్చేస్తాలెండి" అన్నాడు రామారావు. అతను ఊహించినట్లుగానే వెంకటశాస్త్రి సమాధానం యిచ్చాడు. "ఆ ఎంతమాట న్నారు. హోటల్లోకి నల్గురు స్నేహితులు వెళ్ళినపుడు ఎవరు చెల్లిస్తేనేమి బిల్లు?" అని సర్దుకున్నాడు వెంకటశాస్త్రి చేతిలోవున్న అయిదు రూపాయిలు ఖర్చయిపోయూయే! అనుకుంటూ.

* * *

క్రమంగా వారు ముగ్గురు కలిసి మెలిసి తిరగసాగారు. వెంకటశాస్త్రినుంచి ఏదైనా ఒక లాభంపొంది, అతనికి బాధ కలిగించనిదే రామారావు, రంగారావు ఒక దినమైనా గడిపేవారు కారు. రాత్రిళ్ళు శాస్త్రి పడు కున్నాక "ఏమోయి వెంకటశాస్త్రీ" అని పిలిచేవారు. బయటకు రాకపోతే 'ఎల్లా గైనాగృహస్థు. మనలా బ్రహ్మచారి కను కనా, అర్ధరాత్రీ అపరాత్రీ బయటకు రావ డానికి' అనేవారు. అతను బయటికి వస్తే "అప్పుడే నిద్ర ఏమిటయ్యా" అని హేళన చేసేవారు.

ఒకరోజు రామారావు అన్నాడు రంగా రావుతో "వెంకటశాస్త్రి చాలా డబ్బున్న వాడు?"

"ఎవరన్నారు!"

"అతన్ని ఎరుగున్న వాళ్ళవూరు వాడొ కడు చెప్పాడు."

"అయితే డబ్బు ఖర్చుపెట్టడానికి అలా ఏడుస్తాడెందుకూ."

"వెధవ యింకా డబ్బు పోగుచేయాలని ఆశ! ఈ ప్రపంచంలో ధనికులకు స్థానం లేదు. ధనికులను సామాన్య మానవులుగా చెయ్యాలంటే, వాళ్ళని బలవంతంగా హోట ళ్ళకు, సినీమాలకు తీసుకువెళ్ళి డబ్బు ఖర్చు చేయించాలి. ఈసూత్రం అమలుజరిగితే కాని ప్రజాస్వామ్యం పూర్తిగా అమలులోకి రాదు" అన్నాడు రామారావు ఆర్థిక శాస్త్రము బాగా మర్దించినవాడిలా.

రామారావుకు యీ సూత్రం మొదట నేర్పినవాడు రంగారావే. వీళ్ళిద్దరూ కాలే జీలో చేరాక వాళ్ళ ఖర్చులకు తలి తండ్రు లిచ్చే డబ్బు చాలేదికాదు. వాళ్ళవి మధ్య తరగతి కుటుంబాలు. ఎంత డబ్బని యివ్వ గలరు తలి తండ్రులు? అందుచేత కనిపించిన స్నేహితులను చేరి వాళ్ళని బలవంతంగా సినీ మాలకు హోటళ్ళకు తీసుకువెళ్ళి 'మొట్టో' అంటున్నా వాళ్ళచేత డబ్బు ఖర్చుచేయించి ఆనందించేవారు. డబ్బు ఖర్చుపెట్టినవాడు లోపల బాధపడుతూంటే వాళ్ళు బాగా నవ్వి కేరింతాలు కొట్టేవారు. ఇది చూసి కొంతమంది స్నేహితులు వాళ్ళని తప్పించుకు తిరిగేవారు.

"అయితే అంత డబ్బుగలవాడైతే, శాస్త్రిని ఉట్టికాఫీఖర్చులతో వదిలివేయడం బాగులేదోయి" అన్నాడు రంగారావు.

"అందుకే యీ వేళ అతనివద్దనుంచి జరూరుపని ఉందని ఒక పదిహేను రూపా యిలు బదులు అని చెప్పి పుచ్చుకున్నాను" అన్నాడు రామారావు కొంటెగా.

"ఉహూ నాకన్న ఒక అడుగు ముందే వేస్తున్నావే" అని నవ్వాడు రంగారావు.

రెండు నెలలు గడిచినా వెంకటశాస్త్రికి పదిహేను రూపాయిలు తిరిగి యివ్వలేదు రామారావు. కాని, రోజూ ముగ్గురు కలిసి తిరుగుతూనే వున్నారు. ఒకరోజు చాలా అవసరంవచ్చి రామారావుని ఆ పదిహేను రూపాయిలు తిరిగి యిమ్మన్నాడు శాస్త్రి.

"ఏ పదిహేను రూపాయిలు?"

"మర్చిపోయావా? ... మర్చిపోతే అడ గనులే" అన్నాడు శాస్త్రి కటువుగా.

"పదిహేను రూపాయిలు పుచ్చుకుంటే మర్చిపోతాడా రామారావు? నువ్వు అసలు యివ్వలేదేమో? యిచ్చినా, అంత డబ్బున్న వాడవు. ఒక్క పదిహేను రూపాయిలకు కక్కుర్తిపడతా వనుకోలేదు" అన్నాడు రంగారావు వ్యంగ్యంగా.

శాస్త్రి ఆ రూపాయిలకు తిలోదకాలు వదిలేశాడు.

* * *

రంగారావు అన్నాడు "యీ వేళ శాస్త్రి చేత అధమం ఒక పాతిక రూపాయిలు ఖర్చు చేయించాలోయి" దానికి రామారావు తాళంవేశాడు. పద అంటే పద అని వెళ్ళారు యిద్దరు.

వెంకటశాస్త్రివద్ద యింకా ముగ్గురు స్నేహితులున్నారు. శాస్త్రి అందరినీ, ఒకరి కొకరికి పరిచయంచేశాడు. ఆ కొత్తవాళ్ళల్లో నూరిబాబు చాలా చలాకీగా కనిపించాడు. మాట్లాడిన మరుక్షణంనుంచి రామారావును రంగారావును అతిచనువుగా హాస్యాలాడ సాగాడు. నూరిబాబు తమపద్ధతిలో త్వరలో చేరగలడని ఆశించారు రామరావు రంగా రావును. "వెంకటశాస్త్రిని బయటకు రమ్మను ఈసారి యింకా ముగ్గురున్నారుగా మనమను కున్నపని యిట్టే జరుగుతుంది" అని గుసగుస లాడాడు రంగారావు రామారావు చెవిలో. "పదండి బయటికి పోదాం షికారుకు" అన్నాడు రామారావు. ఆరుగురు బయటికి నడిచారు.

దారిలో ఒక పెద్దమనిషి రామారావుని పిలిచి, "ఏమోయి రామారావు యీ పాతిక రూపాయిలు నేను మీ నాన్నగారికి యివ్వాలి. ఈమధ్య ఆయన్ని కలుసుకోలేక పోతున్నాను నే నిచ్చానని చెప్పు" అంటూ సొమ్ము చేతిలో పెట్టాడు.

అనుకున్న పన్నుగడప్రకారం, రంగా రావు అన్నాడు. 'హోటల్లో కాస్త కాఫీ త్రాగుదాం' అని ఆరుగురు హోటలువైపు వెళ్లారు. హోటల్లో ఎవరికికావలిసినది వారు తిన్నారు. కాఫీ త్రాగగానే వికారంగా

వుందని శాస్త్రి డోకుకుంటూ బయటికి నడిచాడు. కిళ్ళీలు కొనితెస్తానని సూరిబాబు గబగబ బయటికి నడిచాడు. చేతులు కడుక్కుంటామని సూరిబాబు ప్రక్కనవున్న మిగిలిన యిద్దరు, కొళాయిదగ్గరకువెళ్ళి అక్కడనుంచి ముభావంగా బయటికి నడిచారు.

సెర్వరు బిల్లు తెచ్చిచ్చాడు. పన్నెండు రూపాయిలయింది. రామారావు, రంగారావు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. బల్లమీద ఉన్నబిల్లు యిద్దరూ ముట్టుకోలేదు. సూరిబాబు కాని, శాస్త్రి కాని, వస్తే వాళ్లకు అంటకడదామనుకున్నారు ఆ బిల్లుని. కాని ఎవరూ తిరిగి లోపలికి రాలేదు. ఇంక బాగుండదని రామారావు చెల్లించాడు ఆ పెద్దమనిషి యిచ్చిన పాతిక రూపాయిలు లోంచి.

డబ్బు చెల్లించాక రామారావు బాధపడసాగాడు కథ అడ్డం తిరిగిందేమా అని. అది ఎవరో పెద్దమనిషి తండ్రికిచ్చిన సొమ్ము. ఆయన తండ్రికి చెబితే డబ్బు యిచ్చేసినట్లు తాను యింటికి వెళ్ళేలోపు! ఎట్లా భర్తీ చేయాలి 'యీ పన్నెండు రూపాయిలు' అని లోపల కొంచెం తికమకపడ్డాడు. వాళ్ళంతా తెగతిని తనచేత డబ్బు ఖర్చుచేయించారని రోషంవచ్చింది. ఇంతకు రెట్టింపు వాళ్ళచేత యీవేళ ఎలాగైనా ఖర్చుచేయించి ప్రతీకారం చేయాలని తలచాడు. రంగారావుతో చెప్పాడు తన ఉద్దేశ్యం 'తప్పకుండా సరే' అన్నాడు రంగారావు.

హోటలుబయట సూరిబాబు, శాస్త్రి తక్కిన యిద్దరు స్నేహితులు నుంచున్నారు మాట్లాడుకుంటూ వీరిద్దరి కోసం నిరీక్షిస్తున్నట్లు. లోపలిబాధ పైకి వ్యక్తపరచకుండా వాళ్ళతో జాగ్రత్తగా కలిసిపోయి మాట్లాడాడు రామారావు.

రంగారావు అన్నాడు 'ఈవేళ చాలా ఖులాసాగా వుంది. ఏదైనా సినీమాకు పోదాము' అని. అల్లాగే అంటే అల్లాగే అన్నారు అంతా.

'పెళ్ళిచేసి చూడు' సినీమాకి బయలుదేరారు. అది మొదటి రోజేమో, జనం కిటకిట లాడుతున్నారు. సినీమా హాలుముందు నుంచున్నారు ఎవరిమటుకువాళ్ళు టిక్కెట్టు కొంటారన్నట్లు.

"రంగారావుగారూ! సినీమాకి వెడదాం అన్నారు. టిక్కెట్లు కొనండి" అన్నాడు సూరిబాబు.

రంగారావుకు ఏంచేయాలో తోచలేదు. టిక్కెట్ల ఖర్చు తన నెత్తినపడేటట్లుంది.

"శాస్త్రి డబ్బున్నవాడయ్యా! ఆమాత్రం ఖర్చుపెట్టడనా మీ ఉద్దేశ్యం" అన్నాడు మామూలుపద్ధతిలో రంగారావు, తనమీద పడబోయే బాధ్యత అతనిపై నెట్టుతూ.

"ఆ సంగతి వేరే చెప్పాలా" అన్నాడు రామారావు.

"సినీమాకి వెడదామని నాకేం తెలుసు. లేకపోతే తెచ్చేవాడినే సొమ్ము" అన్నాడు శాస్త్రి.

"పోనీలెండి! మీరు కొనండి ఇంక రంగారావుగారూ" అన్నాడు సూరిబాబు వెటకారంగా, అతనిమాటల అర్థం తెలిసినట్లు.

టికెట్లుఅమ్మే కిటికీదాకా వెళ్ళి తిరిగి చక్కా వచ్చి "రూపాయిబేడ టిక్కెట్లు పూర్తి అయిపోయాయట. తొమ్మిది అణాల క్లాసుకు వెడితే బాగుండదు. పోనీ రేపు వెడదాంలెండి సినీమాకు" అన్నాడు రంగారావు.

సూరిబాబుప్రక్కనున్న వారిద్దరూ అందుకున్నారు. "పోనీ రెండురూపాయిల సోఫా టిక్కెట్లు కొంటేసరి. అనుకున్నతర్వాత సినీమాకు వెళ్ళకపోవడం అట్టే బాగులేదు"

"అదీ నిజమే. రంగరావుగారూ ఆ సోఫా టిక్కెట్లు కొనండి" అన్నాడు సూరిబాబు.

'నాదగ్గర అంత డబ్బులేదు' అన్నాడు రంగారావు. తనదగ్గర డబ్బున్నా అంత ఖర్చుచెయ్యడం యిష్టంలేక.

సూరిబాబు అందరినీ అడిగాడు. ఎవరిదగ్గరా డబ్బులేదన్నారు కాని రామారావు దగ్గిర ఇంకా పదమూడురూపాయిలున్నాయి. ఆ సంగతి అందరికీ తెలుసు. 'ఏమయ్యా! డబ్బు దాచిపెట్టుకుని అలా ముంగిలా కూర్చుంటారెందుకూ? టిక్కెట్లుకొనవయ్యా' అన్నాడు సూరిబాబు వేళాకోళంచేస్తూ.

'ఈడబ్బు నాదికాదు' అన్నాడు రామారావు నసుగుతూ.

'నీదికాదు కనుకనే ఖర్చుపెట్టు. నీదయితే ఎవరు అడుగుతారేమిటి?' అన్నాడు సూరిబాబు వెంకీగా ఇంకా వెటకారమాడుతూ.

'ఇది మా నాన్న కిచ్చెయ్యాలి' అన్నాడు రామారావు.

'అసలు ఖర్చుపెట్టాలని లేదందురూ' అన్నాడు ప్రక్కనున్న మరొకడు.

'అంత లోభత్వం యెందుకయ్యా! మా శాస్త్రి అయితే లెక్కచేస్తాడా వెధవ పన్నెండు రూపాయిల టిక్కెట్ల ఖర్చు' అన్నాడు సూరిబాబు.

'శాస్త్రి చెప్పాడు ఎన్నోసార్లు మీకు కూడ ఖర్చుపెట్టినట్లు అంత స్నేహమర్యాదలు తెలియకపోవడం......' అని దెప్పిపొడిచాడు మరొకడు అందులో.

'ఇంతోటి నీ డబ్బు ఎవరికి కావాలోయి! యింటికి వెళ్లాక తిరిగి యిచ్చేస్తాంలే. ముందు టిక్కెట్లు కొను' అన్నాడు సూరిబాబు.

'తిరిగి యిచ్చేమాటయితే...' అన్నాడు రామారావు గొంతుక సర్దుకుంటూ.

'నీ డబ్బు యివ్వక దాచ్చేయం లేము' అన్నాడు సూరిబాబు హేళనగా.

రంగారావు ప్రక్కన నుంచున్నాడు మౌనం వహించి, సంభాషణలో కలుగచేసుకుంటే ఆ ఖర్చు తన నెత్తిన పడేలా వుంది.

రామారావు చివరకు తప్పనిసరిగా టిక్కెట్లు కొన్నాడు. సినీమా అయిపోయింది. అందులోని హాస్యంగురించి మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ ఎవరిళ్ళకువారు నడిచారు. టిక్కెట్లు ఖర్చుగురించి ఎవరూ ప్రస్తాపన తేల్చలేదు. రామారావు కదుపుదామనుకున్నాడు. అప్పుడే కదిపితే, బాగా బాధపడినట్లు అందరికీ తెలిసి ఇంకా ఏడిపించగలరని, ఊరుకున్నాడు. మర్నాడు డబ్బుగురించి సూరిబాబును అడుగుదామనుకున్నాడు.

రాత్రి రామారావు పడుకుంటూంటే తండ్రి అడిగాడు. 'ఏరా' రామనాథంగారు నీకు పాతిక రూపాయిలు యిచ్చాడట'

'ఔను'అన్నాడు రామారావునసుగుతూ.

మర్నాడు తండ్రి డబ్బిమ్మంటే ఏంచేసేది! ప్రొద్దున్నే సూరిబాబు దగ్గిరికి వెళ్ళి

డబ్బు అడుగుదామని నిశ్చయించాడు. తండ్రి లేవకుండా, ఇంట్లోంచి బయలుదేరి సూరిబాబు యింటికి వెళ్ళాడు.

'ఈమాత్రం దానికి తిరిగి డబ్బు అడుగుతావనుకోలేదు. స్నేహంలో ఆమాత్రం మర్యాద తెలియకపోతే ఎందుకోయి! ఐనా ఇప్పుడు నాదగ్గర డబ్బెక్కడిది? కావాలంటే నా టిక్కెటుఖర్చు రెండు రూపాయిలిస్తాను తీసుకో' అన్నాడు సూరిబాబు కఠోరంగా.

పాతిక రూపాయిలు తండ్రి కివ్వవలసి వస్తే, రెండు రూపాయిలు ఏమూలకు చాలుతాయి! సూరిబాబును ఏమనాలో అర్థంకాక రంగారావుదగ్గరకు వచ్చాడు రామారావు. 'నాదగ్గర యిప్పుడు ఒక్క కానీలేదురా' అన్నాడు రంగారావు. రామారావుకు తెలుసు రంగారావు డబ్బు ఎంత కావలిస్తే అంతా పుట్టించుకురాగలడు అవసరమైతే. ఇతరుల చేత డబ్బు ఖర్చుచేయించేటప్పుడు తినడానికి తనవెంట వచ్చేవాడు రంగారావు. ఈవేళ అతను ఇలా అంటాడని అనుకోలేదు రామారావు. రంగారావుమీద ఎప్పుడూ లేని ఏహ్యత, కోపంకలిగింది రామారావుకు.

ఏం చెయ్యాలో తోచక, ఏదో ఆలోచిస్తూ, పరధ్యానంగా ఇంట్లోఅడుగుపెట్టాడు రామారావు. వెంకటశాస్త్రిని డబ్బు అడిగితే! కాని ఎలా అడగడం? అనేకసార్లు వెంకటశాస్త్రిచేత బలవంతంగా డబ్బు ఖర్చు చేయించి ఆనందించేవాడు. పదిహేను రూపాయిలు ఆమధ్య పుచ్చుకుని తిరిగి యివ్వలేదు. ఇప్పుడు పాతికరూపాయిలు బదులిమ్మంటే యిస్తాడా! ఇస్తాడనే నమ్మకం లేకపోయింది రామారావుకు.

ఇంట్లో అడుగుపెడుతూండగా, తండ్రి అడిగాడు 'ఆ పాతిక రూపాయిలు ఇలా తెమ్మని'. ఆలోచనలోంచి ఉలిక్కిపడి సమాధానంకోసం తడుముకున్నాడు రామారావు.

'పర్సులో డబ్బు పెట్టాను ప్రొద్దున్న అట్లా బయటకు వెళ్ళివస్తూంటే పర్సు కనిపించలేదు' అన్నాడు రామారావు డబ్బు దొంగిలించబడినట్లు యెత్తువేస్తూ.

'ఈ అబద్ధాలు ఎక్కడ నేర్చావు. నిన్న సినీమాలో ఆరు సోఫాటిక్కెట్లు ఠీవిగా కొన్నావుట. ఎక్కడిదిరా ఆడబ్బు. సినీమా కనకయ్య నాకు చెప్పాడులే. నువ్వు నిన్న స్నేహితులతో సినీమాకి వెళ్లినట్లు' అన్నాడు తండ్రి కోపంగా.

'నేను సినీమాకు వెళ్ళందే' బొంకాడు.

రామారావుతండ్రికి ఒళ్ళుమండింది. పనికిమాలిన స్నేహాలు గూడి, అనవసర ఖర్చులు చేయడమే కాకుండా, కొడుకు అబద్ధాలు కూడా నేర్చుకుంటున్నాడని. 'ఛస్ నోరుముయ్. హోటళ్ళకు సినీమాలకు డబ్బు ఖర్చు చేసి పైగా పోయిందంటావా. డబ్బుకోసం ఇలా దొంగతనంగా కక్కుర్తి పడకపోతే యేం' అని కసిరాడు తండ్రి. రామారావు మౌనంగా నుంచున్నాడు.

'ఎందు కెందుకని ఊరుకుంటున్నాను. ఎంత డబ్బు దొరికితే అంతా తగలెట్టడం నేర్చావు. మేము పడే అవస్థలు నీకేం తెలియటం లేదు. ఎన్నాళ్ళకు వస్తుంది బుద్ధి! ఆ పాతిక రూపాయిలు తెచ్చేదాకా నాగుమ్మం త్రొక్కకు. అవతలకు ఫో' అని గర్జించాడు.

రామారావు నిశ్చేష్ఠుడయ్యాడు. తండ్రి ఇంట్లోంచి పొమ్మంటాడనుకోలేదు ఈ పాతిక రూపాయిల కోసం.

'పోవేం బయటికి ఇంకా అక్కడే నుంచున్నావు వెధవా!' అని అరిచాడు.

తండ్రి అలా తనపై గర్జించడం అదే మొదటిసారి. ఆయన గర్జనలు వింటూంటే రామారావుకు ఒళ్ళంతా చెమట్లుపోశాయ్. కళ్ళుచీకట్లుకమ్మాయ్ గుమ్మంవైపు రెండడుగులు వేశాడు.

వెంకటశాస్త్రి రామారావుఇంట్లోకి అడుగుపెట్టాడు. 'రామారావు! యీవేళ ప్రొద్దున్న మాగదిలో జారిపోయింది నీ పర్సు ఇదిగో! అని ఇచ్చాడు శాస్త్రి. రామారావుకు ఆశ్చర్యంవేసింది. విప్పిచూశాడు అందులో పాతిక రూపాయిలున్నాయి అవి తీసి తండ్రికిచ్చాడు.

తండ్రి రామారావును అనవసరంగా శేకవేసినందుకు నొచ్చుకున్నాడు. ఎవరో స్నేహితులు అతన్ని సినీమాకి తీసుకువెళ్ళి ఉండవచ్చునని ఊహించాడు. 'ఏదో కోపంకొద్దికే కేకలేశానురా' అని బుజ్జగించి ఐదు రూపాయిలు రామారావుచేతిలో పెట్టాడు ఆయన.

తండ్రి ఇంటిలోపలికి వెళ్ళిపోయాక రామారావు అన్నాడు "శాస్త్రి నన్ను క్షమించవోయ్. నువ్వు నాకు సహాయంచేస్తావనుకోలేదు"

"నేను సంభాషణ అంతా విన్నాను నా గదిలోంచి. అవసరమొచ్చినప్పుడు ఆదుకోకపోతే ఎందుకూ స్నేహితుడు" అన్నాడు శాంతంగా శాస్త్రి.

"శాస్త్రి! నీమేలు మరిచిపోలేను... ఆ పదిహేను రూపాయిలు కూడా త్వరలోనే యిచ్చేస్తాను" అన్నాడు రామారావు పశ్చాత్తాపంతో.

"పర్వాలేదు దానికోసం నేను బాధ పడనుగా."

శాస్త్రిలో ఏదో క్రొత్త అనుభూతి, నీతి స్ఫురించాయ్ రామారావుకు.

"నువ్వు చాలా డబ్బున్నవాడవని నాకు కొంతమంది చెప్పారోయ్."

"అవును మానాన్న బాగా ఆస్తిగలవాడు. ఆయనకు నే నొక్కణ్ణే కొడుకుని. కాని ఆ డబ్బు నాకు ఒక చిల్లిగవ్వకూడా వినియోగానికి రాదు."

"అదేం?"

"మా నాన్న ఒక్క కానీకూడ నాకు యివ్వడు. నేనెంత సంపాదించుకుంటే, దానితోనే నా కుటుంబం పోషించుకోవాలి"

రామారావు ఊకొట్టాడు.

"మా నాన్నకి అమ్మకి నేనంటే కోపం. పెళ్ళివిషయంలో వాళ్ళమాట వినలేదు. మా తాతయ్య మా అత్తయ్యకు వాగ్దానమిచ్చాడు నాకు మేనరికం చేస్తానని. మా తాతయ్య చనిపోయాడు నాకు పెళ్ళియీడు వచ్చాక మానాన్న పై సంబంధాలు తీసుకువచ్చాడు. పెద్ద పెద్ద కట్నాలిస్తానన్నారు నాకు. ఇందులో ఏదో కుదుర్చుకున్నాడు మానాన్న డబ్బు కాశించి నేను లెక్కచెయ్యలేదు. మేనరికంవాళ్ళు బీదవాళ్లు చేసుకుంటే కట్నం రాదు అందుచేత దానిసంగతి ఎత్తదన్నారు. మావాళ్ళు వద్దంటున్నా, నేను మేనత్తకూతురును పెళ్ళిచేసుకున్నాను. నామీద కోపం వచ్చి మానాన్న తనపేరవున్న ఆస్తియావత్తూ మా అమ్మపేర వ్రాసి, ఆవిడ అనంతరం నా చెల్లెళ్లకు ఆస్తిఅంతా వ్రాయించేశాడు."

"నువ్వు బాగా డబ్బున్నవాడివని, మరీ పీడించేవాళ్ళం సుమీ" అన్నాడు రామారావు నొచ్చుకుంటూ.

"నేను ధనవంతుడిగా పుట్టినా బీదవాడితో సమానమే."

"శాస్త్రి ఎంత మంచివాడు" అని రామారావు ఒక దీర్ఘనిశ్వాసం విడిచాడు. అప్పటికి యిప్పటికి శాస్త్రిని విడువలేదు రామారావు.